ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
సోమవారం 10 ఫిబ్రవరి 2025



పల్లెల్లో పడకేసిన అభివృద్ధి..



రుద్రంగిలో ఇళ్ల మధ్యే చెత్త

- కనిపించని ప్రత్యేక అధికారుల పాలన 'మార్క్'
- నిధులు లేక పంచాయతీలు సతమతం
- అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- కంకర తేలిన రోడ్లు.. దుర్గంధంతో మురుగుకాలువలు
- ఏడాది దాటిన ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ
- సమస్యల్లో 260 గ్రామపంచాయతీలు

ఆంధ్రజ్యోతి విజిట్

● రోడ్లపైనే చెత్త..

గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఇంటింటికి చెత్త సేకరణ, నిత్యం చెత్తను శుభ్రం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉన్నా ఆ దిశగా ప్రయత్నాలు జరగడం లేదు. జిల్లాలోని చాలా గ్రామపంచాయతీల్లో రోడ్లపైనే చెత్త దర్శనమిస్తోంది. జనావాసాల మధ్యే చెత్త పేరుకుపోవడం, తొలగించే వారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చందుర్తిలో పాత గ్రామపంచాయతీ కార్యాలయం ముందే చెత్తవేయడంతో డంపింగ్ యార్డుగా మారింది. రుద్రంగి, వీర్నపల్లి, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేటలో రోడ్లపై చెత్తకుప్పలను తొలగించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల/నెట్‌వర్క్)

పల్లెలు కంపు కొడుతున్నాయి. అభివృద్ధి పడకేసింది. ఏడాది దాటిపోయినా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ నామ మాత్రంగానే మారిందనే విమర్శలు వస్తున్నాయి. మరోవైపు గ్రామపంచాయతీలకు నిధులు లేక నీరసించిపోతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో వెయ్యిలోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు 105 గ్రామాలు ఉండగా, 5వేల వరకు జనాభా ఉన్నవి 148 గ్రామాలు, అపైన ఉన్నవి 7గ్రామాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన పాలకవర్గాల పదవీకాలం గత సంవత్సరం ఫిబ్రవరిలో ముగిసిపోయింది. ప్రత్యేక అధికారులను నియమించారు. కార్యదర్శులు, ప్రత్యేక అధికారులపైనే పల్లెల బాగోగుల బాధ్యతలు ఉన్నా పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలు వచ్చాయి. ఏడాది గడిచిపోయినా పల్లెల్లో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు జరగకపోయినా పారిశుధ్యం, చిన్నచిన్న రోడ్ల మర మ్మతులకు కూడా నోచుకోలేదు. సిరిసిల్ల నియోజక వర్గం ప్రతిపక్షంలో ఉండడంతో పట్టించుకునే వారే లేకుండాపోయారు. వేములవాడ నియోజకవర్గంలో కొంత మేరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిధులను సమకూరుస్తున్నారు. కానీ పల్లెల్లో సమ స్యలు మాత్రం వెక్కిరిస్తున్నాయి. ఆదివారం 'ఆంధ్ర జ్యోతి నెట్‌వర్క్' పల్లెలను విజిట్ చేసింది.



వీర్నపల్లిలో అధ్వానంగా రోడ్డు



ఇల్లంతకుంటలో అధ్వానంగా మురుగు కాలువ

● అధ్వానంగా పారిశుధ్యం..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రత్యేక అధికారులు, కార్యదర్శులకు ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాల సర్వేలు, గ్రామసభలతోనే సమయం గడిచిపోతోంది. దీంతో పల్లెల్లో కనీసం పారిశుధ్య నిర్వహణపై కూడా దృష్టి పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఏ గ్రామానికి వెళ్లినా మురుగు కాలువలు లేక రోడ్లపై పారుతున్న మురుగునీరు కనిపిస్తోంది. ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, కోనరావుపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి, చందుర్తి, బోయినపల్లి,

(మిగతా 8వ పేజీలో)



ఇల్లంతకుంటలో ప్రవహిస్తున్న బిక్కవాగు

పారుతున్న బిక్కవాగు.. రైతుల్లో ఆనందం..

- యాసంగి పంటలకు ఇబ్బంది ఉండదంటున్న రైతులు..

6

రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం..

- కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్

- ఢిల్లీలో బీజేపీ గెలుపుపై సంబరాలు..

8



సిరిసిల్లలో బీజేపీ నాయకుల సంబరాలు

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



పోత్గల్‌లో పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ముస్తాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలంలోని పోత్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతిగృహాన్ని, వ్యవసాయ మార్కెట్‌యార్డు గోదాంను, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతిగృహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వసతిగృహంలో ఎంతమంది ఉంటారు, వారికి అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఉన్నత శిఖరాలను అధిరోహించుకోవడానికి చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. వసతిగృహంలో స్టోర్‌రూం, వంటగది, డార్మెటరీలను కలెక్టర్ పరిశీలించారు. నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదాంను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న ఎరువుల గురించి ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, పీఆర్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో బీరయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బత్తుల గీతాంజలి, వార్డెన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన తిప్పరవేని శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందులతో పదిరోజుల క్రితం ఆత్మహత్య చేసుకోగా ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, రమణారెడ్డి, అంతగిరి వినయ్‌కుమార్, అయిలయ్య, భాస్కర్‌రెడ్డి, సత్యం తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీ వెంకటేష్ నేత క్షమాపణ చెప్పాలి

సిరిసిల్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : చెన్నూర్ ఎమ్మెల్యే జి వివేక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ వెంకటేష్ నేత బహిరంగ క్షమాపణ చెప్పాలని, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం కమలాకర్, ప్రధానకార్యదర్శి జె నర్సింగ్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంకటేష్ నేత చేసిన వ్యాఖ్యలు ఎస్సీ ఉపకులాలను అవమానపర్చినట్లేనని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లోని శ్రీభక్తాంజనేయ రుక్మిణి విఠలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం సుప్రభాతంతో ప్రారంభించి ధ్వజారోహణాన్ని దేవస్థానం అధ్యక్షుడు వడ్లకొండ ఆనందం చేపట్టారు. మధ్యాహ్నం శ్రీరుక్మిణి విఠలేశ్వరస్వామి కల్యాణాన్ని యాజ్ఞికులు బ్రహ్మశ్రీ లగిశెట్టి రమేష్‌పంతులు, గోశికొండ సత్తయ్య పంతులు కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజా పూర్ణాచందర్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కోడం అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి కుడిక్యాల శంకర్, సహాయకార్యదర్శి పత్తిపాక వేణుగోపాల్, కోశాధికారి కోమాకుల ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు అంకారపు జ్ఞానేభా, రాపెల్లి సంతోష్, మ్యాన రాంప్రసాద్, నల్ల ప్రదీప్, వావిలాల ఆనందం, గెంట్యాల గోపీ, శ్రీపతి పర్శరాం, పంతంరవి, అన్నల్‌దాస్ రాకేష్, ముదిగంటి వేణు, గాజుల రవి, రాపెల్లి కళ్యాణ్, వంగరి గోపీ, పులి అనిల్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కోనరావుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ అన్నారు. మండలంలోని ధర్మారంలో వాలీబాల్ టీం ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివారం రోజున పిల్లలు అందరూ గ్రౌండ్‌లో కనపడడం ఆనందంగా ఉందన్నారు. పిల్లలు మొబైల్ ఫోన్లు వదిలేసి గ్రౌండ్‌లో ఉండడం శుభసూచకమన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంగలి వెంకన్న, అన్నబోయిన సన్నీ, కౌశిక్, శివసాయి, అభిషేక్ తదితరులు ఉన్నారు.

రైతు శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలి

చందుర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రైతుశిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని మండల రైతు సంఘం అధ్యక్షుడు చిలక పెంటయ్య అన్నారు. చందుర్తిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని పెరిక కల్యాణ మండపంలో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే రైతుల శిక్షణ శిబిరంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు వరికెల బాబురావు, లచిరెడ్డి, రామస్వామి, తిరుపతి, భూమరాజు, తిరుపతిరెడ్డి, పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యపరిచేందుకు కృషి చేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు నిత్యం స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. సిరిసిల్లకు చెందిన హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటుచేసి 10 సంవత్సరాలు అయిందని, ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో జీవితాల్లో స్వచ్ఛందంగా వెలుగులు నింపడం అభినందనీయన్నారు. హెల్పింగ్ హార్ట్స్ తమ సేవలను ఇలాగే కొనసాగించాలని, రాష్ట్ర ప్రభుత్వం తరపున సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ పున్నం చందర్, హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అల్వాల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి న్యాయవాది దాసరి తిరుమల, మాజీ కౌన్సిలర్ కుడిక్యాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం..

- బీఆర్‌ఎస్ నాయకుడు కంచర్ల రవి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గురుకులాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, వరుసగా గురుకులాలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని బీఆర్‌ఎస్ నాయకుడు కంచర్ల రవి గౌడ్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్‌తో 16మంది విద్యార్థులు అస్వస్థతకు గురి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో గురుకులాలో ఫుడ్‌పాయిజన్ అవుతూ వందల సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, పదుల సంఖ్యలో విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటితే ఆచరణ మాత్రం గడప దాటడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని ఫుడ్‌పాయిజన్ కాకుండా చర్యలు తీసుకోవాలని, అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కోడం వెంకటేష్, గాజుల మహేష్, శ్రీకాంత్, తిరుపతి, ఉమేష్, లక్ష్మణ్, రాజు, ఉపేంద్ర, తరుణ్ పాల్గొన్నారు.

విహార యాత్రలతో విజ్ఞానం పెంపు..

వీర్నపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : విహారయాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయురాలు ఉదయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు విహారయాత్రకు ఆదివారం వెళ్లారు. విద్యార్థులు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు పీఆర్‌సీని వీలైనంత త్వరగా అమలుచేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలోగల పీఆర్‌టీయూ సంఘ స్థలంలో ఆదివారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంఘం వ్యవస్థాపకుడు సామల యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 54 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ముందున్నామని అన్నారు. పీఆర్‌టీయూ సంఘం అలుపెరుగని పోరాటాల ఫలితంగానే ఉపాధ్యాయుల జీవన ప్రమాణ స్థాయి పెరగడంతోపాటు సమాజంలో గౌరవంగా జీవించే స్థాయికి చేరుకున్నారన్నారు. గతంలో ప్రభుత్వాలు 398 వేతనంతో ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకం జరుగడం, రూ 1200, 1500వేతనంతో రెండు సంవత్సరాల అప్రెంటీస్ కాలంతో నియామకాలు జరపడం ఇవన్నీ కూడా ఉపాధ్యాయుల జీవన ప్రమాణ స్థాయిని, ఆత్మగౌరవాన్ని దిగజార్చడమే కాకుండా ఉపాధ్యాయ వృత్తి పట్ల చులకన భావాన్ని కలిగించే విధంగా ఉండేదన్నారు. పీఆర్‌టీయూ చేపట్టిన ఉద్యమాలతోనే అప్రెంటీస్ విధానం రద్దు చేయడమే కాకుండా గతంలో పనిచేసిన అప్రెంటీస్ సర్వీస్ కాలాన్ని ప్రభుత్వం రెండు నోషల్ ఇంక్రిమెంట్లు కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇవన్నీ ఉపాధ్యాయుల చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమల్లోకి తెచ్చి గతంలో పంచాయతీరాజ్ టీచర్లకు ఎంఈవోలుగా పదోన్నతులు ఇప్పించామన్నారు. ఎన్ని సమస్యలను పరిష్కరించినా సమస్యలు మరోరూపంలో ఉపాధ్యాయ వృత్తిలో వస్తూనే ఉన్నాయన్నారు. అందులో ఒకటి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం సీపీఎస్‌నీ మొట్టమొదటిసారి వ్యతిరేకించిన సంఘం పీఆర్‌టీయూ అన్నారు. భవిష్యత్తులో సీపీఎస్ పద్ధతి కోసం పూర్తిస్థాయిలో పోరాటం చేస్తుందన్నారు. కేజీబీవీ టీచర్లకు మినిమం టైమ్స్ కల్పించి, మోడల్‌స్కూల్ టీచర్‌లకు అన్ని రకాల సౌకర్యాల కల్పించడంలో తప్పకుండా కృషి చేస్తామన్నారు. కోర్టులో ఉన్నటువంటి ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎడ్ల కిషన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చిప్ప యాదగిరి, దుబ్బాక ప్రభాకర్, ఎండీ షఫీ, చీరాల ప్రభాకర్, జిల్లా బాధ్యులు మామిడిశెట్టి మహేష్, జక్కని నవీన్, నల్ల పర్శరాం, ఎర్ర ప్రవీణ్‌కుమార్, పోతుగంటి శ్రీనివాస్, పోన్నాల బాల్‌రెడ్డి, బత్తుల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గీతామందిరం భక్తుల పాదయాత్ర



పాదయాత్రలో భక్తుల భజన..

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని గీతామందిరం కమిటీ ఆధ్వర్యంలోని భక్తులు ఆదివారం వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి యేటా గీతామందిరం వార్షికోత్సవం అనంతరం రాజన్న ఆలయం వరకు పాదయాత్రకు వెళ్లి స్వామివారిని దర్శించుకుంటామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలో బంగారు పతకం


బంగారు పతకం సాధించిన విద్యార్థిని శరణ్య

గంగాధర, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థిని అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ వారుణి తెలిపారు. ఈ నెలలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఇంటర్ నేషనల్ ఓపెన్ కరాటే పోటీలను నిర్వహించారు. పాఠశాల నుంచి లగిషెట్టి శరణ్య పాల్గొని అండర్ 14 విభాగం స్పారింగ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకం, 40 కిలోల విభాగంలో కటాస్‌లో ద్వితీయ స్థానం పొందినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి అంతర్జాతీయ కరాటే క్రీడల్లో పాఠశాల కీర్తిని చాటి బహుమతులు పొందిన శరణ్యను సన్మానించారు. కార్యక్రమంలో కరాటె మాస్టర్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


స్వామి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన చర్యలు చేపట్టారు.

ప్రైవేటు డిగ్రీ కళాశాలలో షార్ట్‌సర్క్యూట్

- కాలిపోయిన కంప్యూటర్లు, ఫర్నీచర్


కాలిపోయిన పరికరాలను పరిశీలిస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి కంప్యూటర్లు, ఫర్నిచర్ కాలిపోయాయి. కళాశాలలో నుంచి మంటలు రావడాన్ని గమనించిన వాచ్‌మెన్ అప్రమత్తమై నిర్వాహకులకు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకున్న వారు అగ్నిమాపక సిబ్బందికి విషయం చేరవేశారు. హుటాహుటిన చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఘటనలో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని నిర్వాహకులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి చేరుకుని ప్రమాదం తీరును అడిగి తెలుసుకున్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ రంగాపూర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతిచెందిన మహిళకు సుమారు 32-35 మధ్య వయసు ఉంటుందని, మృతురాలు మతిస్థిమితం లేని స్థితిలో ఉందన్నారు. శనివారం రాత్రి ప్రమాదం జరగగా మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురిలో భద్రపరిచినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు. సంఘటనపై ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

వలస కార్మికుడి ఆత్మహత్య

గంగాధర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒద్యారం క్వారీలో పనిచేస్తున్న వలస కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్ పటేల్(25) కొద్దిరోజులుగా ఒద్యారం గ్రానైట్ క్వారీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పది రోజుల నుంచి పనిచేయడం ఇష్టలేక తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు తెలిపినా వారు పనిలోనే ఉండాలని సూచించారు. పని చేయడం ఇష్టంలేక తల్లిదండ్రులు ఇంటికి రావద్దన్న మాటలకు మనస్తాపంతో గ్రానైట్ క్వారీ సమీపంలో ఆదివారం చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కన్యలాల్ పటేల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


అజయ్(ఫైల్)

ధర్మారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని ఖానంపల్లి గ్రామానికి చెందిన గడ్డం అజయ్ (22) ఓ అమ్మాయిని ప్రేమించగా ఆమె పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపానికి లోనై అజయ్ గతనెల 29న పురుగుల మందు తాగాడు. చికిత్సనిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆదివారం మరణించాడు. అజయ్ తండ్రి గడ్డం ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఏపీ-20 వై 7659 ఆటో ట్రాలీలో 20సంచుల్లో తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న డ్రైవర్ కర్రు సమ్మయ్యను విచారించగా బిట్టుపల్లి గ్రామానికి చెందిన కాసు రాజు, ఓదెలు చెప్పిన విధంగా బియ్యాన్ని మహారాష్ట్రలోని సిరోంచకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో గంజాయి విక్రయిస్తున్న శాస్త్రినగర్‌కు చెందిన వేముల శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వేముల శ్రీనివాస్ గోదావరిఖనిలోని ఓ హోటల్లో పని చేస్తున్నాడు. అతని చిన్న కుమారుడు చంద్రప్రకాష్ మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో పని చేస్తున్నాడు. అతని ద్వారా గంజాయి సుల్తానాబాద్‌లోని శ్రీనివాస్ ఇంటికి చేరవేస్తున్నాడు. దానిని శ్రీనివాస్ ఈ ప్రాంతంలోని వలస కూలీలకు, యువతకు చిన్న చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్నాడు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా శ్రీనివాస్ గంజాయితో పట్టుబడ్డాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని మెడికల్ షాపులో దొంగతనానికి పాల్పడ్డ దొంగను పోలీసులు పట్టుకున్నారు. శాస్త్రినగర్‌కు చెందిన వేముల భవాని ప్రకాష్ అలియాస్ బబ్లూ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం శివశంకర్ మెడికల్ స్టోర్ షటర్ కు వేసి ఉన్న తాళాన్ని పగులకొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.24 నగదు, సెల్ ఫోన్‌ను చోరీ చేశాడన్నారు. నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి రూ.18 వేల నగదు సెల్ ఫోన్ రికవరీ చేశామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు.

బీర్‌పూర్‌లో అలజడి


బీర్‌పూర్ గ్రామం

- **వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో.. మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామంలో ఆందోళన**
- **ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని గుబులు**

బీర్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో జరుగుతున్న వరస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ముప్పాల లక్ష్మణ్‌రావ్ అలియాస్ గణపతి స్వగ్రామం బీర్‌పూర్‌లో అలజడి నెలకొంది. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుం దోనని జగిత్యాల జిల్లా బీర్‌పూర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన బల్మూరి నారాయణరావ్ అలి యాస్ క్యాడర్ ప్రభాకర్ 2024 డిసెంబరు 23న అరెస్టు అయ్యాడు. 2025 జనవరి 21న ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో గరియాబంద్ జిల్లా కుల్హాడీఘాట్ అటవీప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్ రెడ్డి అలి యాస్ చలపతి అలియాస్ జయరాం(62)తో పాటు ఒడిశాలో మావోయిస్టు పార్టీ కీలకనేత మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ(ఎస్‌జడ్‌సీ) సభ్యుడు గుడ్డులతో పాటు మరికొంతమంది మావోయిస్టులు మృతి చెందారు.ఈ వార్త తెలిసిన గ్రామస్థులు గణపతి ఎలా ఉన్నాడో, ఎక్కడ ఉన్నాడో అని నిత్యం చర్చించుకుంటున్నారు.

● ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉద్యమం వైపు..

మావోయిస్టు అగ్రనేత ముప్పాల లక్ష్మణ్‌రావ్ అలియాస్ గణపతి జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో ముప్పాల గోపాల్‌రావ్-శేషమ్మ దంపతులకు 1949వ సంవత్సరం జూన్16న నాలుగో సంతానంగా జన్మించాడు. గణపతి అన్నయ్య నర్సింగారావ్ హైదరాబాద్‌లో ఉండగా తమ్ముడు రాంచందర్‌రావ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ మృతి చెందాడు. గణపతికి ఇద్దరు అక్కలు ఉన్నారు. గణపతికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాగినేడుకు చెందిన విజయతో వివాహం జరగ్గా కుమారుడు శ్రీనివాసరావ్ ఉన్నాడు. గణపతి విదేశాలకు వెళ్లి వచ్చి ఇంజనీరింగ్ ఉద్యోగం చేస్తున్నాడని తెలిసింది. గణపతి మూడో తరగతి వరకు బీర్‌పూర్‌లో చదివిన అనంతరం కరీంనగర్ జిల్లాలోని అమ్మమ్మ గ్రామమైన గంగిపెల్లిలో 7వ తరగతి వరకు చదివాడు. జగిత్యాలలో 7వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యను అభ్యసించాడు. కరీంనగర్‌లోని రాజరాజేశ్వర కాలేజీలో బీఎస్సీ పూర్తి చేశాడు. 1970లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించి కరీంనగర్ జిల్లా లోని ఎలగందులలో మొదట పోస్టులో చేరారు. ఆ తరువాత ఎలిగేడులో కొంతకాలం పనిచేశాడు. అనంతరం రుద్రంగికి బదిలీపై వెళ్లిన ఆయనను బీఈడీ ట్రైనింగ్ నిమిత్తం వరంగల్ జిల్లాకు పంపగా పంపగా అక్కడ మావోయిస్టు నాయకులు నల్లా ఆదిరెడ్డి మరియు కొండపల్లి సీతారామయ్యలతో పరిచయం ఏర్పడింది. చివరికి వారి భావాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరాలని నిర్ణయించుకున్నాడు. అతడు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్కిస్ట్-లెనినిస్ట్) పీపుల్స్ వార్ గ్రూప్ యొక్క ప్రారంభ సభ్యులలో ఒకడు. ఇప్పుడు విలీనమైన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) అని పిలువబడే పార్టీకి కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శి స్థాయికి గణపతి అంచెలంచెలుగా ఎదిగాడు. గణపతి లొంగిపోవాలని 2013లో బీర్‌పూర్‌లో అప్పటి ఎస్పీ శివకుమార్ ఆధ్వర్యంలో అంతర్మథనం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో బస చేశారు.

చిన్నప్పుడు ఎవరినీ ఏమీ అనేవాడు కాదు

-బింగి నర్సయ్య, బీర్‌పూర్



చిన్నపుడు మేము చదువుకునే సమయంలో లక్ష్మణ్‌రావ్ అందరితో మంచిగానే ఉండేవాడు. ఎవరితో కొట్లాడేవాడు కాదు. మాతో పాటు హన్మండ్ల గుడి వద్ద ఉన్న బడిలో చదువుకున్నాడు. లక్ష్మణ్‌రావ్ నాకంటే ఒక్క తరగతి పెద్ద. అందరం కలిసి ఆడుకునే వాళ్లం.

● బీర్‌పూర్‌లో పోటాపోటీ స్తూపాలు


పోలీసులు నిర్మించిన శాంతిస్తూపం

పోలీసుల చేతుల్లో మావోయిస్టులు మృతిచెందారని అప్పట్లో మావోయిస్టు దళాలు జగిత్యాలకు వెళ్లే బస్టాండ్ వద్ద ఎర్ర స్తూపాన్ని నిర్మించారు. మావోయిస్టుల చేతిలో అమరులైన 43 మంది పేరు మీద పోలీసులు ధర్మపురి వెళ్లే బస్టాండ్ వద్ద శాంతిస్తూపాన్ని నిర్మించారు. ఉమ్మడి సారంగాపూర్ మండలంలో 22 గ్రామాలు ఉండేవి. 11గ్రామాలతో గణపతి స్వగ్రామాన్ని బీర్‌పూర్ మండల కేంద్రంగా ప్రకటించారు. ప్రస్తుతానికి బీర్‌పూర్ గ్రామంలో మావోయిస్టు ప్రభావం పూర్తిగా తగ్గిపోవడంతో యువకులు ఆర్మీ, ఇండియన్ నేవీ, సివిల్ పోలీస్ కొలువులు సాధిస్తున్నారు. గ్రామంలో సుమారు 15 మంది వరకు పోలీస్ శాఖలో ఉద్యోగాలు చేస్తున్నారు.

పారుతున్న బిక్కవాగు.. రైతుల్లో ఆనందం

- యాసంగి పంటలకు ఇబ్బంది ఉండదంటున్న రైతులు - నాలుగు వేల ఎకరాలకు ప్రయోజనం


ఇల్లంతకుంటలో ప్రవహిస్తున్న బిక్కవాగు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అనంతారం ప్రాజెక్టు దిగువన ఉన్న బిక్కవాగు ప్రవహిస్తుండటంతో యాసంగి పంటలకు ఇబ్బంది తొలగిపోయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.93 టీఎంసీల నీరు ఉంది. దీంతో స్థానిక రైతుల వినతుల మేరకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో మాట్లాడి అనంతారం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయించారు.

ప్రాజెక్టు నిండి మత్తడి దూకడంతో దిగువన ఉన్న బిక్కవాగు పారుతోంది. ఓవైపు ఫీడర్ ఛానల్ ద్వారా రహీంఖాన్‌పేట గ్రామంలోని సింగరాయకుంటకు నీరు చేరుతూ, మరోవైపు దిగువ ప్రాంతానికి నీరు వస్తోంది. జంగమరెడ్డిపల్లె, అనంతారం, ఇల్లంతకుంట, వంతడుపుల, నర్సక్కపేట, జవారిపేట గ్రామాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు ప్రయోజనం కలుగుతుంది. బిక్కవాగు సమీపంలోని రైతులందరు వరిపంటను సాగుచేశారు. వరిలో కలుపు తీసి రెండవసారి ఎరువులు చల్లుతున్నారు. ప్రస్తుత దశలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని, ఇలాంటి సమయంలో బిక్కవాగు పారుతుండటం వల్ల ఇబ్బందులు తొలగినట్లేనని, అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను మరింత పెంచితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

● యాసంగి పంటకు ఇబ్బంది తొలగిపోతుంది..

- దయ్యాల కనుకయ్య, రైతు ఇల్లంతకుంట



బిక్కవాగు పారుతుండటంతో యాసంగి పంటకు ఎదురయ్యే ఇబ్బంది తొలగిపోతుంది. వరిచేను కలుపుతీయడం వల్ల నీరు ఎక్కువగా తాగుతుంది. ఎండల వల్ల బావులు, బోర్లలో నీరు రోజురోజుకు తగ్గుతోంది. పదిహేను రోజుల పాటు వాగుపారితే రైతులకు ఉపయోగం ఉంటుంది. బిక్కవాగు పారితే ఎనిమిది గ్రామాల రైతులు లాభపడతారు. బిక్కవాగులోని ముళ్లపొదలను తొలగించి, వ్యర్థాలను వేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

● నీటి విడుదలతో ప్రయోజనం..

- పారిపెల్లి మధుసూదన్‌రెడ్డి, రైతు జంగమరెడ్డిపల్లె



అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి అనంతారం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ప్రాజెక్టు దిగువన ఉన్న బిక్కవాగు పారుతుండటం భూగర్భ జలాలు పెరుగుతాయి. రైతుల పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ నీటిని విడుదల చేయించడం సంతోషకరం. ఎక్కువ మొత్తంలో నీటి విడుదల చేసినట్లయితే మరింత ప్రయోజనం కలుగుతుంది.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్

ఐదు ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం -వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో వరుసగా చోరీలకు పాల్పడుతున్న ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను ఆదివారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు త రలించారు. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాల ను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన జక్కుల గోపాల్, సింగంరాజు, నేరెళ్ల నరేష్, సంపతి కుమారస్వామి, బుర్రరాజేందర్ జల్సాలకు అలవాటు పడి ఒక ముఠాగా ఏర్పడ్డారు. జక్కుల గోపాల్‌కు చెందిన ఓ కారులో రాత్రి సమయాల్లో తిరుగుతూ ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామంలో గత డిసెంబరులో బైక్ దొంగిలించారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామంలో మరో బైక్‌ను, చిన్నబెల్లాల్ గ్రామంలోని ఇంటి ముందు పార్కు చేసిన మరో బైక్‌ను, జగిత్యాల మండ లం తిప్పన్నపేట, దండేపల్లి మండలంలోని ద్వారకానగర్‌లో ఇంటిముందర పార్కు చేసిన రెండు బైక్‌లను దొంగతనానికి పాల్పడ్డారు. దొంగిలించిన బైక్‌లను తమ ఇంటి వద్ద దాచి పెట్టినట్లు నిందితులు ఒప్పుకున్నారు. జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు పెద్దిరాజం బైక్ అపహరించడంతో జగిత్యాల రూరల్‌స్టేషన్‌లో బాధితుడు జనవరిలో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసు లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా ఆదివారం తిప్పన్నపేట గ్రామ శివారులో కారులో వస్తున్న ఐదుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు పట్టుబడ్డారు. నిందితులను పట్టుకున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్, కానిస్టేబుల్‌లు శ్రీనివాస్, గంగాధర్, రాహుల్, ఉమర్, మోహన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

కడుపు నొప్పి భరించలేక వృద్ధుడి ఆత్మహత్య


అమరగొండ వీరయ్య(ఫైల్)

సైదాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మం డలంలోని వెన్కేపల్లి గ్రామానికి చెందిన అమరగొండ వీరయ్య (75) అనే వృద్ధుడు కడుపునొప్పి భరించలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వీరయ్య-రాజమ్మ దంపతులు ఓ ఇంటిలో ఉంటున్నారు. శనివారం రాజమ్మ ఐనవోలు జాతరకు వెళ్లడంతో ఇంట్లో వీరయ్య ఒక్కడే ఉన్నాడు. వీరయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం సాయంత్రం పెద్ద కుమారుడు అమరగొండ రాజయ్య కథ చెప్పేందుకు వేరే ఊరికి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం సుమారు 9 గంటల ప్రాంతంలో చిన్న కుమారుడు మల్లేష్ తన తండ్రి వీరయ్య వద్దకు వెళ్లి అతడు భోజనం చేసే వరకు ఉండి తన ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం అమరగొండ మల్లేష్ పాలు ఇచ్చేందుకు తనతండ్రి వద్దకు వచ్చి ఇంట్లో చూడగా తన తండ్రి కనిపించలేదు. దాంతో చుట్టుపక్కల వాళ్లను అడుగగా తెలియదని చెప్పారు. చుట్టుపక్కల, బావులలో వెతుకగా అమర గొండ కొమురయ్య చేదబావిలో శవమై కనిపించినట్లు తెలిపారు. తన తండ్రి అమరగొండ వీరయ్యకు కొంతకాలంగా కడుపు నొప్పి ఉన్నదని, ఈ మధ్యనే ఆస్పత్రిలో చూపించగా ఆపరేషన్ చేయాలని డాక్టర్ చెప్పాడని మృతుడి చిన్న కుమారుడు మల్లేష్ తెలిపాడు. కడుపు నొప్పి భరించలేక రాత్రి ఎవరు లేని సమయంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని మృతుడి చిన్న కుమారుడు అమరగొండ మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

మామ లైంగికంగా వేధిస్తున్నాడని కోడలు నిరసన

- తల్లిదండ్రులు, కొడుకుతో కలిసి బైఠాయింపు

మంథని, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోడలును కన్న కూతురిలా చూసుకోవాల్సిన మామ లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని పెద్దపల్లి జిల్లా మంథని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం కోడలు నిరసన వ్యక్తం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన యువతికి నాలుగేళ్ల క్రితం పోచమ్మవాడకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉండగా ప్రస్తుతం యువతి ఏడు నెలల గర్భవతి. కాగా మామ తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని, భర్త సైతం తండ్రి చెప్పినట్లు సహకరించాలంటున్నాడని ఆరోపణలు చేసింది. అదనపు కట్నం కోసం మామ, అత్త, భర్త వేధింపులకు గురి చేయడంతోపాటు గత నెల 12న ఇంట్లో నుంచి గెట్టివేయగా మంథని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు పోలీసు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. స్టేషన్‌లో ఫిర్యాదు తర్వాత తాను ఖమ్మంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లినట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం భర్త తన సెల్‌ఫోన్‌కు ఓ అమ్మాయి ఫొటోను పంపి ఆమెను పెండ్లి చేసుకుంటున్నానని, నీతో, నీకు పుట్టిన పిల్లలతో నాకు సంబంధం లేదని చెప్పినట్లు పేర్కొంది. దీంతో ఆదివారం మంథనికి వచ్చిన యువతి తల్లిదండ్రులు, కొడుకుతో కలిసి బైఠాయించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను, కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా గత నెల 12న అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారన్నారు. ఆమె ఖమ్మంకు వెళ్లడంతో కౌన్సెలింగ్ పిలిచినా రాలేదని పేర్కొన్నారు. మామ, భర్త లైంగిక వేధింపులపై ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్లు



చొప్పదండి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రహదారిపై ఎక్కడైనా ప్రమాదం జరగగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది 108 టోల్‌ఫ్రీ నంబర్. 108కు ఫోన్ చేయగానే అంబులెన్స్ వచ్చి ప్రమాద బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్తుంది, ఆపదలో సహాయపడుతుంది. ఇదే విధంగా పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు 100నంబర్‌కు డయల్‌చేసి ఫిర్యాదు చేస్తాం. ఇవన్నీ అత్యవసర సమయంలో మనకు గుర్తుకు వచ్చే నంబర్లు. ఇదే విధరంగా ఇతర అనేక రకాల సేవలకు వివిధ నంబర్లు ఉన్నాయి. అత్యవసరంలో టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయగానే సేవలు అందుబాటులోకి వస్తాయి, సమస్యలు పరిష్కారం అవుతాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సేవల కోసం ఉన్న టోల్‌ఫ్రీ నంబర్ల వివరాలు మీ కోసం...

అగ్నిమాపక సేవల కోసం 101
అగ్నిప్రమాదాలు సంబవించినప్పుడు ఫైరింజన్ కోసం 101 నంబర్‌కు ఫోన్ చేస్తే ప్రమాద స్థలానికి ఫైరింజన్‌ను పంపిస్తారు.

సంచార వైద్యం కోసం 104
రైతు మంగిటే పశువుల వైద్యానికి 104 అంబులెన్స్ వాహనం సంచార వైద్యశాలగా ఉపయోగపడుతుంది.

రైల్వే సమస్యల కోసం 139
రైలులో ప్రయాణించేటప్పుడు, ఇతర సమస్యల కోసం 139 నంబర్‌కు ఫోన్ చేస్తే అధికారులు సమస్యలను పరిష్కరిస్తారు.

టెలికాం సేవల కోసం 198
దేశవ్యాప్తంగా మొబైల్ నెట్‌వర్కింగ్ సేవలో అంతరాయం ఏర్పడిన, వినియోగదారుల సమస్యలు, సందేహాలే తీర్చడానికి ఈ నంబర్ ఉపయోగపడుతుంది.

ఆపదలో ఉన్న మహిళల కోసం 1091
ఈ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఆపదలో ఉన్న, వేధింపులకు గురైన మహిళలు సహాయం పొందవచ్చు.

పిల్లలను వేధిస్తే, బాల కార్మికులను గుర్తిస్తే 1098
6 నుంచి 14సంవత్సరాల పిల్లలు వేధింపులకు గురైనా, బాలకార్మికులను గుర్తించినా 1098 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం అందిస్తే అధికారులు వారిని చేరదీస్తారు.

ఓటరు నమోదు, తదితర సమస్యల పరిష్కారానికి 1950
ఎన్నికలు, ఓటర్ల జాబితాలో వ్యక్తిగత సమాచారం, ఓటింగ్ తేదీలు, పోలింగ్‌స్టేషన్ వివరాలు తెలుసుకోవచ్చు. ఫిర్యాదుల పరిష్కారానికి కాల్ చేయవచ్చు.

మీ సేవలో సమాచారం, సమస్యల పరిష్కారం 1100
ఈ టోల్ ఫ్రీ నంబర్‌ను మీసేవా కాల్ సెంటర్‌గా ఉపయోగిస్తారు. రాష్ట్రంలోని ప్రజలు ఫిర్యాదులు, సూచనల కోసం ఈ నంబర్‌ను ఉపయోగించవచ్చు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912
విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ఇతర సమస్యలు ఎదురైతే ఈ నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు.

వినియోగదారుల సేవల కోసం జాతీయ హెల్ప్‌లైన్ 1915
వినియోగదారులు ఏదైనా ఉత్పత్తి, సేవపై సులభంగా ఫిర్యాదు చేయడానికి, ఫిర్యాదులను ట్రాక్ చేయడానికి ఈ టోల్ ఫ్రీ నంబర్ వీలు కల్పిసుంది.

వ్యవసాయ సమాచారం, సమస్యలపై కిసాన్ కాల్ సెంటర్ 1800-1801551
వ్యవసాయంలో సలహాలు, సూచనలు కోసం రైతులు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. వాతావరణ వివరాలను సైతం తెలుసుకోవచ్చు.

మహిళల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ 181
గృహహింస వరకట్న వేధింపులు, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు వంటి పరిస్థితుల్లో ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. మహిళలు అందుబాటులో ఉన్న సహాయ సేవలు, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి తెలుసుకోవచ్చు.

ఉపాధి హామీ పనులలో సమస్యలు పరిష్కారం కోసం 1800-2001001
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సమస్యలు, వేతనాల కోసం కూలీలు ఈ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930
సైబర్ నేరగాళ్లకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

టీఎస్ఆర్‌టీసీ సేవల కోసం 040-69440000
బస్సు ప్రయాణంతో పాటు ఇతర సమస్యలకు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులకు సమస్య చేరి దాని పరష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



కనుకులగిద్దె గ్రామంలో సాగు వివరాలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్న యువ రైతు

సోషల్ మీడియా సాయంతో వ్యవసాయం

- సామాజిక మాధ్యమాలను అనుసరిస్తున్న యువ రైతులు
- ఆధునిక పద్ధతుల్లో సాగుతో అధిక దిగుబడులు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా యువ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. గ్రామాల్లో యువ రైతులు సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతున్నారు. వ్యవసాయానికి సంబంధించి కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. పంటల సాగులో కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఆధునిక పద్ధతులు ఏవి.. అధిక దిగుబడులు ఎలా సాధించాలి.. ఏ సీజీన్లలో ఏ కూరగాయాలు పండించాలి.. ఏ కాలంలో విత్తనాలు వేసుకోవాలి, పంట వివిధ దశల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలేంటి.. సాగులో యంత్రాల వినియోగం ఎలా..మార్కెట్లో వేటికి డిమాండ్ ఉంటుంది.. తదితర విషయాలను యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని ఆచరణలో పెడుతున్నారు. అధిక దిగుబడులను సాధిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.



జూపాక గ్రామంలో సాగు పనుల వివరాలను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తున్న యువ రైతు

● వీడియోలు, పోస్టుల ద్వారా కొత్త విషయాలు

వివిధ రాష్ట్రాల్లో రైతులు సాగు చేస్తున్న కూరగాయలు, ఇతర పంటలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్ వీడియోలు, ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడుతున్నారు. వాటిని ఫాలో అవుతూ కొత్త విషయాలను రైతులు తెలుసుకుంటున్నారు. తమకు అవసరమైన సమాచారాన్ని వెతికి సేకరించుకుంటున్నారు. వాటిపై అవగాహన పెంచుకుని ఆచరణలో పెడుతున్నారు. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని తెలుసుకుంటున్నారు. కలుపు తీసే యంత్రాలు, క్రిమిసంహారక మందులు చల్లే డ్రోన్లు, పొలం దున్నేవి, పంటలు కోసే యంత్రాల గురించి తెలుసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన రైతుల వీడియోలను స్థానిక రైతులు చూస్తూ కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు.

సోషల్ మీడియా ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవచ్చు

-జొంగోని అనిల్, యువ రైతు, జూపాక



నేను చాలా కాలంగా సోషల్ మీడియా ఫాలో అవుతూ పంటల సాగులో కొత్త విషయాలను తెలుసుకుంటున్నాను. యూట్యూబ్‌లో వివిధ రకాల సాగు పనులు, మెళవకులు తెలుసుకుంటున్నాను. వాటిని అనుసరిస్తున్నాను. వ్యవసాయంలో స్మార్ట్‌ఫోన్ బాగా ఉపయోగపడుతోంది. పాడి గేదెల పెంపకం, అధిక పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన వీడియోలను చూసి ఆచరిస్తున్నాను.

మొదట్లో ఇబ్బంది పడ్డాను..

-బొల్లవేణి శ్రావణ్‌కుమార్, యువ రైతు, కందుగుల



వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు తెలియక మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాను. నేను అందరి లాగా పంటలను సాగు చేసేవాడిని. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ గ్రూప్‌లలో సాగుకు సంబంధించిన వీడియోల ద్వారా పలు విషయాలు తెలుసుకొని సాగు పనులు చేస్తున్నాను. నాకు తెలిసిన వారికి కూడా పంట సాగు వివరాలను తెలియజేస్తున్నా. కొత్త మెళకువలతో సాగు చేసిన రైతుల ఫోన్ నంబర్లు తీసుకొని వారితో మాట్లాడుతున్నాను. వారి సూచనలు, సలహాలతో పంటలు సాగు చేస్తూ దిగుబడి పొందుతున్నాను.

కొండగట్టు క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్సీ కవిత

- అంజన్న సన్నిధిలో పూజలు



కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మల్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామి క్షేత్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఆలయ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపొందించి అమలుకు కృషి చేసిందన్నారు. ప్రభుత్వం మారినందన అభివృద్ధి ఆగిపోకుండా గత ప్రణాళిక అమలు చేయాలని లేకుంటే అంత కన్నా మెరుగైన ప్రణాళికతో కాంగ్రెస్ ప్రభుత్వం దేవస్థానం అభివృద్ధి చేయాలని ఆమె అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ కవిత కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొండగట్టుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తుంటారని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొండగట్టు అభివృద్ధికి మెట్లదారి, కోనేరు, షెడ్లు, దీక్ష విరమణ మండపం పనులు చేపట్టిందన్నారు. రూ.25 కోట్లతో వరదకాలువ నుంచి నీటిని తరలించి కొండపై శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను వచ్చే హనుమాన్ జయంతిలోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొండగట్టు ఘాట్ రోడ్డు అభివృద్ధి పనులపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. ఎమ్మెల్సీ వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీలు రామ్మోహన్‌రావు, ప్రశాంతి, విండో చైర్మన్ సాగర్‌రావు, బద్దం తిరుపతిరెడ్డి, కొంక నర్సయ్య, కోటేశ్వర్‌రావు, సురేందర్ ఉన్నారు.

'కులగణనలో బీసీ జనాభా తగ్గడం పెద్ద కుట్ర'

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో బీసీ జనాభా తగ్గడం వెనక పెద్ద కుట్ర జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీసీ భనవంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పర్శహన్మాండ్లు మాట్లాడారు. బీసీ కులగణన బీసీలకు అమృతం అవుతుందని అనుకున్నామని కాని అసెంబ్లీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పెట్టిన కులగణన లెక్కలు, ఆయన మాట్లాడిన తీరును బట్టి చూస్తే బీసీ కులగణన అనేది బూడిదలో పోసిన పన్నీరు అయిందన్నారు. 2014లో బీసీల జనాభా 51 శాతం ఉంటే 2024 సంవత్సరంలో 46 శాతానికి తగ్గడం వెనకాల పెద్ద కుట్ర దాగి ఉందని అనుమానాలను వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- భారీగా తరలి వచ్చిన భక్తులు



కల్యాణానికి భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణ వేడుకలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను శావలో ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వేర్వేరు సమయాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

ఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కల్యాణ వేడుకల్లో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావు, కొల్వాయి సింగిల్‌విండో చైర్మన్ నవీన్‌రావ్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు పాత పద్మ రమేష్, ఆలయ మాజీ చైర్మన్‌లు ఎనగంటి స్వామ్రాట్, నేరెల్ల సుమన్‌గౌడ్, గోనె రమణ రావు , మాజీ జడ్పీటీసీ సభ్యులు ముప్పాల జలజ, కొల్మూల రమణ, ఆల య ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, మదు కుమార్, చిన్న సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగ, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగంతో పాటు నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలో ఆత్మీయ సమ్మేళన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి 55వేల నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూనివర్సిటీలకు తగిన నిధులిచ్చారన్నారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. సమావేశంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మహిళా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సత్యప్రసన్నరెడ్డి, కౌరు సుగుణాకర్‌రెడ్డి, శంకర్, బాబు, కిరణ్‌కుమార్, పుష్పలత, రాహుల్, రాజు, లావణ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్, రత్నం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థించిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ఆదివారం ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన పోరాడిన పార్టీ అభ్యర్థులను ఆదరించాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తే ఏమీ చేయలేదనే భావన ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఉందని, పట్టభద్రులు, విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలకోసం పోరాడింది బీజేపీ మాత్రమేనని అన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు చూపుతున్న ఆదరణ, విశ్వాసాన్ని మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తామన్నారు. మొదటి ప్రాధాన్య ఓటును బీజేపీ అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ వై సునీల్‌రావు, వైద రామాను, బండ రమణారెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, కొండాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

పట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే పోటీ

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను సన్మానిస్తున్న పట్టభద్రులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, నిరుద్యోగ పట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే తాను ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఆదివారం హుజూరాబాద్, జమ్మికుంటలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులకు అనేక సమస్యలు ఉన్నాయని, విద్యా వ్యాపారం చేసే వ్యక్తులకు వారి సమస్యలపై అవగాహన లేదన్నారు. విద్యా వ్యాపారాన్ని చేస్తున్న వ్యక్తి రాజకీయాల్లోకి వచ్చి పట్టభద్రుల గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. తనకు విద్యారంగ ప్రొఫెసర్‌గా పట్టభద్రుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. యువత, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నన్నారు. హుజూరాబాద్, జమ్మికుంటలోని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ మద్దతు తెలపడం అభినందనీయమన్నారు.

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ నామినేషన్లు

- రేపు పరిశీలన, 13న ఉపసంహరణ

- 27న పోలింగ్... మార్చి 3న ఓట్ల లెక్కింపు

- భారీ ర్యాలీలకు అభ్యర్థుల సన్నాహాలు

కరీంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారం ముగియనున్నది. ఈ నెల 11న నామినేషన్లను పరిశీలించి అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ తీవ్రంగా ఉంది. ఓటర్ల నమోదు కార్యక్రమం నుంచే పోటాపోటీగా ఓటర్ల నమోదు చేయించుకోవడంతోపాటు ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈనెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 58 మంది అభ్యర్థులు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో 49 మంది పట్టభద్రుల స్థానానికి, తొమ్మిది మంది ఉపాధ్యాయ స్థానానికి నామినేషన్లను వేశారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగియనుండడంతో చివరి రోజున పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేస్తారని భావించిన అధికార యంత్రాంగం కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. చివరిరోజు పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డితోపాటు మరికొందరు అభ్యర్థులు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కూడా భారీ ర్యాలీలు నిర్వహించి నామినేషన్లను దాఖలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- సిరిసిల్ల అశోక్, రుద్రంగి ఎస్సై



ఆంధ్రజ్యోతి : రుద్రంగిలో రోడ్డుప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై : రుద్రంగి ప్రధానరహదారిలో ప్రమాదాలు జరగకుండా పలు జంక్షన్ల వద్ద బారికేడ్లను ఏర్పాటుచేశాం. వాహనాల స్పీడ్ కంట్రోల్ చేసే విధంగా బారీకేడ్లతో స్పీడ్ కంట్రోలర్ జిగ్ జాగ్ డ్రైవింగ్ విధానం ఏర్పాటు చేయడంతో ప్రమాదాలను నివారిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మైనర్ల డ్రైవింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై : మైనర్ల డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. భారీ జరిమానాలు విధించడమే కాకుండా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. మైనర్లు డ్రైవింగ్ చేసిన సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే వాహన యాజమాని, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం.

ఆంధ్రజ్యోతి : మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్సై : మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని నియంత్రించేందుకు ప్రతిరోజు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం. ఎక్కువసార్లు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- రుద్రంగి (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

ముళ్లపొదల తొలగింపు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట రైతులు ఏకమై ఫీడర్ చానెల్‌లో ముళ్ళపొదలను ఆదివారం తొలగించారు. అనంతారం ప్రాజెక్టు నిండి మత్తడి దూకుతుండటంతో గ్రామంలోని సింగరాయకుంటకు నీటిని తీసుకవెళ్లాలని రైతులు నిర్ణయించారు. సింగరాయకుంటలో నీరువస్తే ప్రయోజనం పొందే రైతులు ఫీడర్ చానెల్‌లోని చెత్తను తొలగించడంతో కుంటలోకి నీరు రావడం ప్రారంభమైంది.సింగరాయకుంట నిండితే యాసంగి పంటలకు ఇబ్బందులు తొలగిపోతాయని రైతులు పేర్కొన్నారు.

శివాజీ ఆశయాల సాధనకు పాటుపడదాం..

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):శివాజీ ఆశయాల సాధనకు పాటుపడదామని కేసన్నపల్లె ఆరెక్షత్రియ సంఘ అధ్యక్షుడు వజ్జపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామంలో ఆదివారం సమావేశం జరుగగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సామాజిక కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు చేరువకావాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు వజ్జపల్లి దేవరావు, ఉపాధ్యక్షులు వజ్జపెల్లి హనుమంతు, వడిజ అనీల్, ప్రధాన కార్యదర్శి వడిజ రాజు, కార్యదర్శి వజ్జపల్లి శ్రీనివాస్, కోశాధికారి వజ్జపల్లి శ్రీనివాస్‌లతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం నిత్య పూజలు, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ప్రత్యేక ఆకర్షణగా ఉలుఖల ఆరాధన నిలిచింది. కార్యక్రమంలో రాష్ట్ర ఆగమ సలహామండలి సభ్యులు సంపత్కుమార కృష్ణమాచార్యులు, ఆలయ వ్యవస్థాపకులు రోడ్ల ఊర్మిల తిరుపతిరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు

ప్రభుత్వ భూములను కాపాడాలి

రుద్రంగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రుద్రంగిలోని ప్రభుత్వ భూములు కాపాడేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగవాత్ తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రుద్రంగి ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి దర్జాగా నిర్మాణాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల ఓ వ్యక్తి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని హై కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యంను దాఖలు చేశాడని, దానిపైన డీపీవోకు ఆ భూమిపై సమగ్ర విచారణ జరిపి 15 రోజుల్లో రిపోట్ ఫైల్ చేయాని హైకోర్టు ఆదేశించినట్లు తెలిపారు. మూడేళ్ల క్రితం మండల పరిషత్ అధికారుల సమక్షంలో జిల్లా సర్వే అధికారులు గ్రామపంచాయతీకి చెందిన భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించిన నివేదికను ఇవ్వడం జరిగిందన్నారు. ఆ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు కాపాడే వరకు బీఆర్ఎస్ పార్టీ తరుపున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్, గంగ మహేష్‌రెడ్డి, చెప్యాల గణేష్, మాడిశెట్టి ఆనందం, దయ్యాల పెద్దులు, ఉప్పులుటి గణేష్, కోడగంటి శ్యామ్, నాగులపల్లి రవి, గోల్లెం నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.


చందుర్తిలో జనావాసాల మధ్య చెత్త


రాచర్లబొప్పాపూర్‌లో రోడ్డుపై మురికినీరు

పల్లెల్లో పడకేసిన అభివృద్ధి..

(5వ పేజీ తరువాయి)

రుద్రంగి, వేములవాడ అర్బన్, రూరల్, మండలాల్లోని ప్రధాన గ్రామపంచాయతీల్లో డ్రైనేజీలు ఉన్నా నిర్వహణ కనిపించడం లేదు. చెత్తాచెదారం నిండి మురు గునీరు ప్రవహించక దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు కాలువలు తీసేవారే కరువయ్యారు. దీంతో దోమలతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు.

● రోడ్లు అస్తవ్యస్తం..

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. తుఫాను ప్రభావంతో భారీగా కురిసి వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులను నోచుకోలేదు. కొన్నిచోట్ల కల్వర్టులు దెబ్బతిని ప్రమాదాలకు గురవుతున్నారు. నడవడానికి వీలు లేకుండా ఉన్న రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. ప్రభుత్వం నుంచి ప్రత్యేకమైన నిధులు రాకపోవడంతోనే రోడ్లకు మరమ్మతులు జరగడం లేదని తెలుస్తోంది.

● ప్రత్యేక డ్రైవ్‌తో హడావుడి..

గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు గత సంవత్సరం ఫిబ్రవరిలో ముగియడంతోనే ప్రభుత్వం పల్లెలపై దృష్టి సారించినట్లుగా ప్రత్యేక డ్రైవ్ పేరుతో హడావుడి మాత్రం చేసింది. జిల్లాలోని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ గ్రామాల్లో నిర్వహించినా నామ మాత్రంగానే జరిగింది.


గొల్లపల్లిలో జనావాసాల మధ్య చెత్త


ఎల్లారెడ్డిపేట మండలంలో స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు(ఫైల్)

ప్రమాదాలకు నిలయంగా సర్దాపూర్ మూలమలుపు

- నిత్యం ప్రమాదాలతో వణికిపోతున్న ప్రజలు.. - స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి..


సర్దాపూర్‌లో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రయాణికులు వణుకిపోతున్నారు. సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న సర్దాపూర్‌లో ఉన్న మూలమలుపువద్ద ప్రమాదాలు జరిగి పలువురు చనిపోగా, చాలా మంది గాయాలపాలయ్యారు. గ్రామ శివారు ప్రాంతం నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటపూర్ వరకు రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో సర్దాపూర్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులతో పాటు కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బేక్రర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..

- గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి



సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరిగి చాలా మంది మృత్యువాత పడుతున్నారు. దీనిపై జిల్లా ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

సిరిసిల్ల పట్టణ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గం

సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గంను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మున్నూరు కాపు సంఘం కళ్యాణ మండపంలో పట్టణ సమన్వయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. నీలి శంకర్, గడ్డం నరసయ్య, బొప్ప దేవయ్య, కల్లూరి రాజు, ఎరుకల సూర్యప్రకాష్, పట్టణ సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో మున్నూరుకాపు సంఘం పట్టణ అధ్యక్షుడిగా వొజ్జల అగ్గి రాములు, ఉపాధ్యక్షులుగా కల్ల సత్తయ్య, దుమాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఇప్పపుల లక్ష్మణ్, కోశాధికారిగా బిలి శ్రీనివాస్, సహాయ కోశాధికారి తోట శంకర్, సహాయ కార్యదర్శిగా కొడిమ్యాల వేణుగోపాల్, కార్యనిర్వహక కార్యదర్శిగా చల్ల రవీందర్, సంయుక్త కార్యదర్శిగా బత్తుల భూమేష్, కార్యవర్గసభ్యులుగా శీలం రాజు, లింగంపల్లి సతీష్, పల్లికొండ నరసయ్య, సోక్కి శ్రీనివాస్, కాశెట్టి పరశురాములు, ఇప్పపూల రాజు, కూస మహేష్, బల్యాల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గసభ్యులను సన్మానించారు. సమన్వయ కమిటీ సభ్యులు నీలి శంకరయ్య గడ్డం నరసయ్య బొప్ప దేవయ్య కల్లూరి రాజు ఎరుకల ప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం..

- కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్ - ఢిల్లీలో బీజేపీ గెలుపుపై సంబరాలు


తంగళ్లపల్లిలో బీజేపీ నాయకుల సంబరాలు


మరిమడ్లలో బీజేపీ నాయకుల సంబరాలు


వేములవాడ అర్బన్‌లో నాయకుల సంబరాలు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనతోనే దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీపై భారతీయ జనతాపార్టీ జెండాను ఎగురవేసిందని, త్వరలో రాష్ట్రంలో సైతం బీజేపీ జెండాను ఎగురవేస్తామని కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఆదివారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు టపాసులు, కాల్చి స్వీట్లను పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగరి అనిల్‌కుమార్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి బర్కం నవీన్‌యాదవ్, పట్టణ ఉపాధ్యక్షులు ఊరగొండ రాజు, చోప్పదండి అంజన్న, మోర శ్రీహరి, గాజుల వేణు, పంపరి అర్జున్, చోప్పదండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్) : దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీలో భారతీయ జనతాపార్టీ జెండాను ఎగురవేయడం హర్షనీయమని భారతీయ జనతా పార్టీ యువమోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి అన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ, బీజేవైఎం మండల కమిటిల అధ్వర్యంలో సంబరాలు జరుపుకుని స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గజభీంకార్ సంతోష్, అసాని లింగారెడ్డి, కాళీచరణ్, సిరిసిల్ల వంశీ, సందవేణి రాజు, నరేష్, ప్రకాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని మరిమడ్లలో ఆదివారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ 27 సంవత్సరాల తర్వాత ఘన విజయం సాధించడంతో నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి దిలీప్, మాట్ల రాజు, మాజీ ఎంపీటీసీ రేణుక, బొల్లం శ్రీనివాస్, ఇండ్ల శ్రీనివాస్, పుల్కం ప్రశాంత్, లక్కం హరిప్రసాద్, దేవ నర్సయ్య, చేతన్, సుమిత్, మణికంఠ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడంతో వేములవాడ అర్బన్ మండల బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నందికమాన్ వద్ద టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్, లింగం పల్లి శంకర్, ఏరెడడ్డి రాజిరెడ్డి, గోనె భాస్కర్, చంద్రగిరి ప్రశాంత్, సంతోష్, ఎరుగోక్కుల రమేస్, చల్ల నర్సయ్య, శ్రీధర్, గంట మహేష్, శ్రీనివాస్ రెడ్డి, తిప్పరవేని రాజు, ఎర్రం లక్ష్మీ, నర్సింగరోజు శంకర్, అంజన్న యాదవ్, పోచంపల్లి బాను, సోలంకి అరవింద్, మధు, ప్రశాంత్,మహేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం


ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చందుర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగాపూర్ అనుబంధ గ్రామమైన గుడిపేటకు చెందిన గరుడ మహేష్ అనే యువకుడు 3 నెలల క్రితం మృతిచెందగా తోటి స్నేహితులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01సంవత్సరంలో తమతో పాటు పదవ తరగతి చదువుకున్న మహేష్ కుటుంబానికి బాసటగా నిలిచి రూ.35వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రంను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరి రవీందర్, అవారి మనోహర్, వరికెల కిస్టస్వామి, గోళ్లపెల్లి శ్రీనివాస్, పెంటల రమేష్, లోకోజు సతీష్‌రాజు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్ట్‌ల అందజేత


క్రీడాకారులకు టీషర్ట్‌లను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణించి మండలానికి మంచి పేరును తీసుకరావాలని తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాల్గాం ప్రవీణ్‌కుమార్ కోరారు. తంగళ్లపల్లి మండలం కేంద్రంలో ఆదివారం మండలంలో క్రీడాపోటీల్లో రాణిస్తున్న పలువురు క్రీడాకారులకు టీషర్ట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగాల భూపతి, మాజీ ఉపసర్పంచ్ పెద్దూర్ తిరుపతి, మచ్చ శ్రీనివాస్, సామల గణేష్, మోర రాజు, రాపెల్లి అనందం, కడారినవీన్‌రెడ్డి, బాలసాని రాము, అలువాల ప్రేమ్, గంగా అజయ్, గుంటి అనిల్, అలువాల పృథ్వీ, మ్యాకల సుధీర్, బాల సాని శ్యామ్, గోకని రాజు, చందు, పెద్దూర్ రాకేష్ ముద్రకోట లోకేష్, బోల్లారం రాహుల్, రాపెల్లి ప్రవీణ్, చౌకి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం..

చందుర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు రేషన్‌కార్డులు ఇస్తామని కాలయాపన చేస్తోందన్నారు. ఆరు గ్యారెంటీలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజాపాలన అని చెప్పుకొని, ప్రజలను మోసం చేస్తోందన్నారు. రేషన్ కార్డులు, రైతు భరోసా ఇస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని ఏ ఒకటి కూడా అమలుచేయకుండా పబ్బం గడుపుతోందన్నారు. ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయక ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న ఎమ్మెల్సీ, స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు..

ముగిసిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్వామి గోజురై కరాటే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ కరాటే, కుంగ్ ఫూ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ముగిసింది. ఆదివారం ఉదయం సిరిసిల్ల మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మంచి శ్రీనివాస్ రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ కరాటే అండ్ కుంగ్ ఫూ ఛాంపియన్‌షిప్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లలు మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరిగా నేర్చుకోవాలని అన్నారు రాష్ట్ర స్థాయి పోటీలను ఒక మహిళ స్వామి గోజురై కరాటే స్పోర్ట్స్ అకాడమీ ఎండి సమీనా నిర్వహించడం గర్వకారణమన్నారు. టోర్నమెంట్లో కరీంనగర్‌కు చెందిన శ్రీనివాస్ స్టూడెంట్స్ జట్టు కైవసం చేసుకోగా ఓవరాల్‌గా సమీనా స్టూడెంట్స్ పతకాలను సాధించారు. విజేతలకు ముఖ్య అతిథులు పతకాలతో పాటు బహుమతులను అందించి అభినందించారు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు దాదాపు 650మంది పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రెడ్డి నాయక్ రమేష్ టోర్నమెంట్ చైర్మన్ అమిత్ ఖాన్ అడ్వైజర్ అలిమ్ ఖాన్ సీనియర్ కరాటే మాస్టర్ నేరెళ్ల శ్రీధర్‌గౌడ్ మామిడాల సమ్మయ్య ఒరగంటి రామకృష్ణ కరీంనగర్ ఉష సెక్రెటరీ విద్యాసాగర్ కనకయ్య విక్రం బాలరాజు సంపత్ క్రీడాకారులు పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గుంత..


ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంత

వీర్నపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రధాన రహదారిపై మూలమలుపు వద్ద సీసీ రోడ్డు మధ్య పెద్ద గుంత నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రతిరోజు మారుమూల గ్రామాలకు ప్రయాణించే వాహనదారులు రాత్రిపూట అదుపు తప్పి గుంతలో పడితే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందని వాపోతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రాణాలు పోతే గాని పట్టించుకోరా.. అని వాహనదారులు అధికారులపై మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతను పూడ్చే చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

చెదిరిన తారు.. మరమ్మతులు చేపట్టరూ..!

- ఇబ్బందుల్లో వాహనదారులు - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కొండాపూర్, నిమ్మపల్లి మధ్యలో చెదిరిన తారు రోడ్డు

కోనరావుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన తారు రోడ్డు గుంతలమయంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏర్పాటు చేసిన తారురోడ్డు ఇప్పుడు చెదిరిపోయి గుంతలమయంగా మారింది. తిరిగి మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలం సుద్దాల నుంచి కనగర్తి,నిజామాబాద్, వెంకట్రావుపేట, కొండాపూర్ మీదుగా నిమ్మపల్లి వరకు వెళ్లే రహదారి తారురోడ్డు చెదిరిపోయి గుంతలు ఏర్పడ్డాయి. అలాగే కొండాపూర్, నిమ్మపల్లి గ్రామాల మధ్య ఉన్న ఒర్రెపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలం ఇబ్బందులు తప్పడం లేదు. బ్రిడ్జి నిర్మాణం చేపడితే నిమ్మపల్లి వెళ్లడానికి సులభంగా మారుతుంది. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ స్పందించి ఈ రహదారిపై దృష్టి పెట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి

- మల్యాల దేవయ్య, మాజీ సర్పంచ్, కొండాపూర్



కొండాపూర్, నిమ్మపల్లి మీదుగా సిరికొండ వరకు వెళ్లే ఈ రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి. గతంలో నిర్మించిన తారు రోడ్డు చెదిరిపోయి గుంతలుగా ఏర్పడ్డాయి. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలి.